క్లుప్తంగా

క్లాప్‌మిత్రలకు వైద్యపరీక్షలు



శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా క్లాప్‌మిత్రకు వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, కాలేయ పరీక్ష, కిడ్నీ తదితర పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూత్రాలు వివరించారు. పరిసరాలు పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం స్వచ్ఛత సేవా ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి, సూపర్‌వైజరు అలవలపూడి ఏడుకొండలు, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మి ప్రసన్న, పంచాయతీ కార్యదర్శి బోడ్డు యాకోబు, సతీష్, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



నరసరావుపేట రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఎస్ఆర్‌కేటి కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమినిగడ్డ గురులింగంను శనివారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సత్కారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి గురులింగం చేస్తున్న కృషిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, వెంకట సుబ్బారావు, ఫాతిమారాణి, అపర్ణ, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో ఇద్దరు చిన్నారులకి వినికిడి వరం



నరసరావుపేట: స్థానిక డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో శనివారం ఇద్దరు చిన్నారులకి కోక్లియర్ ఇంప్లాంట్ మెషీన్ స్విచ్‌ఆన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ కోక్లియర్ ఇంప్లాంట్ నిపుణుడు డాక్టర్ వేపూరి రాజేష్ పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన రెండేళ్ల ఏడునెలల వయస్సున్న ఏ.లేరిసక్లియ రెండు చెవులు, ఏలూరు జిల్లా పాములవారిగూడెంకు చెందిన ఐదేళ్ల జెస్సికా ప్రదీప కుడిచెవికి కోక్లియర్ సర్జరీ విజయవంతంగా నిర్వహించారు. స్విచ్‌ఆన్ కార్యక్రమానికి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ లోకిరెడ్డి అంజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులకు వినికిడి వినిపించారు. దీంతో ఆ పిల్లల తల్లితండ్రుల కళ్లు ఆనందభాష్పాలతో నిండిపోయాయి. తమ హాస్పిటల్‌లో ఇప్పటి వరకు వందకు పైగా కోక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించామని, పల్నాడు జిల్లాను రాష్ట్రవ్యాప్తంగా వినిపించేలా చేసిన ఏకైక హాస్పిటల్ డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ మాత్రమేనని డాక్టర్ అంజిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పుట్టుకతో మూగ, చెవుడు ఉన్న ఐదేళ్లలోపు చిన్న పిల్లలకు ఎన్టీఆర్ వైద్య సేవ, ఈహెచ్ఎస్ పరిధిలో కార్డు కలిగిన వారికి ఈ కోక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ శస్త్రచికిత్స ద్వారా చిన్నారులు కొత్త జీవితాన్ని సొంతం చేసుకుంటున్నారు. సర్జన్ డాక్టర్ వేపూరి రాజేష్ మాట్లాడుతూ క్లిష్టమైన సీఎస్ఎఫ్ లీక్స్ సర్జరీలు, అన్ని రకాల క్లిష్టమైన చెవి, ముక్కు, గొంతు సర్జరీలు, అలాగే బ్లాక్ ఫంగస్ కేసులను కూడా అతి తక్కువ ఖర్చుతో డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో విజయవంతంగా చేస్తున్నామని వెల్లడించారు.

చిన్నపాటి వర్షానికే కారుతున్న మండల పరిషత్ కార్యాలయం



నూజెండ్ల:మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం చిన్నపాటి వర్షానికే కారుతుంది. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనం పాతది కావటంతో పైకప్పు (స్లాబు) పటిష్టత దెబ్బతింటుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు స్లాబు నుంచి నీటి ఊట ఎక్కువగా వస్తోంది . దీనివల్ల పైకప్పు దెబ్బతినటంతో పాటు గోడలు నెర్రెలిస్తున్నాయి. వర్షపు నీరు లీకేజీ కారణంగా ఎంపీపీ గదిలో సీలింగ్ శనివారం రాత్రి కూలిపోయింది. స్లాబులోనికి నీరు కారుతుండటంతో పిల్లర్లు పెచ్చులూడిపోతున్నాయి. సంవత్సరాలుగా కార్యాలయ నిర్వహణ పట్టించుకోక పోవటంతో ఈ దుస్థితి ఏర్పడిందని ప్రజాప్రతినిధులు అంటున్నారు. ఎంపిడివొ ఉమాదేవి వివరణ ఇస్తూ కార్యాలయ మరమ్మతులకు నిధులు కేటాయించా మన్నారు. రూఫ్ వాటర్ లీకేజీ కాకుండా ప్రత్యేక జాగ్రత్తలతో ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోండి

స్త్రీనిధి మేనేజరు కె.రహుల్



బయోమెట్రిక్ మిషన్లు అందజేస్తున్న అధికారులు

శావల్యాపురం: మహిళా సంఘాల్లో అర్హత కల్గియున్న సభ్యులందరికీ స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తామని వినుకొండ క్లస్టర్ స్త్రీనిధి మేనేజరు కె.రహుల్ అన్నారు. శనివారం స్థానిక మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో వివోఏ స్త్రీనిధి రుణాలు రీకవరీ లక్ష్యాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సుస్థిరమైన జీవనోపాదులు పెంపుదలకు స్త్రీనిధి రుణాలు దోహదపడతాయన్నారు. వినుకొండ నియోజవర్గంలో స్త్రీనిధి రుణాలు రూ.20 కోట్లు నిధులు కేటాయించగా 840 మంది రూ. 7 కోట్లు స్త్రీనిధి రుణాలను పారదర్శకంగా అందజేశామన్నారు. ఇందులో శావల్యాపురం మండలం రూ. 9 కోట్లు కేటాయించగా రూ. 2 కోట్లు 25 లక్షలు రుణాలు మంజూరు చేశామన్నారు. స్త్రీనిధి రుణాలు నగదు రహిత రూపంలో జరుగుతుందన్నారు. తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తామన్నారు. డాక్యుమెంటేషన్ చేసిన 48 గంటల వ్యవధిలో రుణాన్ని వారి బ్యాంకు ఖాతాకు నేరుగా జమ చేస్తామ న్నారు. ఈపూరు, బొల్లాపల్లి మండలాల్లో దీర్ఘకాలిక బకాయిలు ఉన్నందున రుణాలు మంజూరు చేయలేదన్నారు. బ్యాంకు సివిల్‌స్టోర్ ఆధారంగా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా స్త్రీనిధి రుణా లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం వీవోఏలకు మంత్ర బయోమెట్రిక్ మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, ఇన్‌చార్జ్ ఏపీయం అబ్బూరి రామారావు, సీసీలు మేరికుమారి, కరుణమ్మ వీవోఏలు పాల్గొన్నారు

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటి, మున్సిపల్ కార్మికులకు హెల్త్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం రజకకాలనీ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజాన్ని, రాష్ట్రాన్ని ఆరోగ్యవంతంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. భవిష్యత్‌లో ఎంతటి వర్షం కురిసినా నీరు నిల్వ ఉండకుండా పట్టణంలోని డ్రెయినేజీ వ్యవస్థను బలపరుస్తున్నామని చెప్పారు.

ప్రజలు వ్యర్థాలను కాల్వల్లో పడవేయరాదని సూచించారు. ఇంటితో పాటు పరిసరాలు, రోడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వివిధ వ్యాధులకు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న 37 మందికి రూ. 47.17 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

విత్తన బంతులతో పచ్చదనం మెండు

యడ్లపాడు: పచ్చదనం..పరిశుభ్రత ప్రజల్లో భాగం కావాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని దింతెనపాడు గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, చైతన్య లిటిల్‌స్కూల్ సంయుక్తంగా చేపట్టిన సీడ్ బాల్స్ (విత్తనబంతులు) విస్తరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బొద్దచెరువులో రోటరీక్లబ్‌సభ్యులు, పాఠశాల విద్యార్థులతో కలిసి విత్తనబంతులు జల్లారు. పోపూరి వెంకయ్య, కందిమళ్ల రఘురామారావు, ఉప్పుటూరి ప్రసాద్, రామసుబ్బారావు, ఈదర గిరి, దండా లక్ష్మీనారాయణ, గల్లా సాంబశివరావు పంచాయతీ సర్పంచ్ దేవరపు సుమతి, చౌదరి, అత్తోట శ్రీనివాసరావు, పోపూరి హనుమంతరావు, టి.చంద్రకళరాజు, కుడారి యోహాను తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర



నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మొగిలి నాగలక్ష్మీ, ఎంపీడీవో స్వరూపరాణి, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీవో స్వరూపరాణి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, పచ్చదనం మెరుగైన నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదన్నారు. ఇందులో భాగంగా వీధుల్లో మెరుగైన పారిశుద్ధ్యం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతిరోజూ గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారని, దీంతో గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధ్యమౌతుందన్నారు.

పర్యావరణానికి పచ్చదనం చాలా ముఖ్యం

పరిసరాలను పరిశుభ్రం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట: పర్యావరణానికి పచ్చదనం ఎంతో అవసరమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుంటూరురోడ్డులోని ఆజాద్ పార్కు, ఎస్ఎస్ఎన్ కళాశాల బాలుర హాస్టల్ రోడ్డు, రావిపాడురోడ్డులోని కేబీఆర్ పార్కులలో మొక్కలు నాటి చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం పర్యావరణం కాలుష్యంబారిన పడకుండా మొక్కలు ఎక్కువగా నాటి పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మనుషులకు కావాల్సిన ఆక్సిజన్ అందించటంలో చెట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అందువల్ల పచ్చదనం ఫరిడవిల్లేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మున్సిపల్ ఇంజనీర్ డి.రవి, డీఇ రఫీక్, టీపీఓ సాంబయ్య, ఏఇ జ్యోతి, శానిటరీ ఇన స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

నరసరావుపేట టౌన్: ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ శనివారం తెలిపారు. ప్రకాశం జిల్లా దర్శికు చెందిన రేఖనారు నారాయణ కుమారుడు నరసరావుపేట లోని రావిపాడులో గల ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. స్వగ్రామం నుంచి రెండు రోజుల క్రితం కళాశాలకు ఇంటి నుంచి బయలుదేరాడు.

అయితే కళాశాల హాస్టల్ నుంచి ఫోన్ చేసి తన కుమారుడు రాలేదని నారాయణకు చెప్పారు. దీంతో అతని కోసం గాలించినా ఫలితం దక్కలేదు. ఈ మేరకు విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆటల పోటీలకు పలువురి ఎంపిక

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు..



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

నరసరావుపేట రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 12 పతకాలు సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి శనివారం తెలిపారు. ఈనెల 12వ తేదీన నరసరావుపేట జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన కరాటే పోటీలలో కె.గణేష్ కుమార్, ఎం.హర్షవర్ధన్, ఓ.వరుణ్, ఎస్.సత్యసాయి గౌతమ్ కుమార్, ఎస్.ఈశ్వర్ కుమార్, ఎస్‌కె సుహాన్‌లు పతకాలు సాధించినట్టు తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి చిలకలూరిపేట ఏఎంజీలో నిర్వహించిన జూడో పోటీలలో డి.వెంకట దుర్గారావు, ఓ.శ్రీనులు, 19వ తేదీ నుంచి ఏఎంజీలో నిర్వహించిన బాక్సింగ్ పోటీలలో ఎం.దేవరాజ్, టి.జాన్‌పాల్‌లు, మాస్టర్ ఆర్ట్స్‌లో ఎస్‌కె నజీర్, టి.జాన్ పాల్‌లు పతకాలు సాధించినట్టు వివరించారు. ప్రతిభ చాటిన విద్యార్థులు ప్రధానోపాధ్యాయనీ పార్వతి, వ్యాయామ ఉపాధ్యాయులు వి.పద్మావతి, ఎస్‌కె ఫాతిమా, పి.తిరుపతిరావు, ఎస్‌కె రోషి దాబిలు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది



చిలకలూరిపేట: స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద ఈ నెల 23న 100 పడకల ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసరావు కోరారు. ఆసుపత్రిలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో గర్భాశయ, రొమ్ము, నోటి క్యాన్సర్ వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని వెల్లడించారు. వీటితో పాటు మానసిక వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు, రేడియాలజీస్టులు, పాథాలజిస్టులు సేవలు అందిస్తారని తెలిపారు. 23వ తేదీ ఉదయం 8 గంటలకు వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు కృష్ణదేవరాయలు ప్రారంభిస్తారని వెల్లడించారు.

కనపర్రులో ఉచిత వైద్యశిబిరం

నాదెండ్ల: మండలంలోని కనపర్రు గ్రామంలో శనివారం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ప్రసాద్‌నాయక్ పాల్గొని 192 మందికి దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. విషజ్వరాలు ప్రబలుతున్నందున ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వినియోగించాలని, కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు వజ్జా సింగయ్య, జయప్రసాద్, జయరాజు, రాఘవయ్య పాల్గొన్నారు.

చెంఘీజ్‌ఖాన్‌పేటలో ఉచిత వైద్య శిబిరం

యడ్లపాడు: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భరద్వాజ, సిబ్బంది పాల్గొని రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డులకు నమోదు చేసుకోండి

సత్తెనపల్లి: అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక, ఆర్థిక భద్రతకు కేంద్ర ప్రభుత్వం 2021 ఆగస్టులో ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించిందని, కార్మికులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారి వి.అన్నపూర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేసి వారికి గుర్తింపు కార్డులు అందజేస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలుగా ఉన్నప్పుడు ఈ-శ్రమ్ కార్డులు పెద్ద మొత్తంలో నమోదు చేశారని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, చేనేత కార్మికులు, మత్స్య కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి శ్రామికులు, వీధి వ్యాపారులు,వడ్రంగులు, రవాణా కూలీలు, ఇళ్లల్లో పనిచేసే కార్మికులు, ఆశా కార్యకర్తలు, వివిధ చేతివృత్తుల వారు ఈ- శ్రమ్ కింద లబ్ధికి అర్హులన్నారు. 16 నుంచి 59 ఏళ్ల లోపు వారందరూ లబ్ధి పొందవచ్చని తెలిపారు. దీనికి ఆధార్‌కార్డు, బ్యాంక్‌ఖాతా, ఆధార్‌తో అనుసంధాన మైన సెల్‌ఫోన్ నంబరు ఉండాలని సూచించారు. హెచ్‌టీటీపీ.ఈ శ్రమ్ జీవోవీ.ఇన్ పోర్టల్ లో వివరాలు నమోదు చేసుకోవచ్చని వివరించారు. సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ కార్యాలయంలో, మీసేవ, సీఎస్‌సీ కేంద్రాలు, సచివాలయాల్లో నమోదుకు అవకాశం కల్పించారని తెలిపారు. సందేహాలు ఏమైనా ఉంటే 94925 55155లో సంప్రదించాలని సూచించారు.

ఎరువులు కొరత లేకుండా చర్యలు



శావల్యాపురం: మండలంలోని శావల్యాపురం, కారుమంచి సొసైటీ పరిధిలో రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయ కార్యాలయ సహాయ సంచాలకులు హనుమంతరావు వెల్లడించారు. శనివారం స్థానిక సొసైటీ కేంద్రంలో రైతులకు ఎరువులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30తో ఖరీఫ్ సీజను ముగుస్తుందన్నారు. సొసైటీలు రైతు సేవా కేంద్రాలల్లో ప్రభుత్వ నిబంధనలు మేరకు ఖరీఫ్ రబీ సీజనుల్లో రైతులు అన్ని రకాల ఎరువులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. రైతుల అవసరం మేరకు మాత్రమే యూరియా ఎరువును వాడాలన్నారు. ఆయనతో పాటు సొసైటీ చైర్మన్ గడుపూడి విశ్వనాథం, ఏవో రామినేని రామారావు, డైరెక్టరు గోనుగుంట్ల నాగరాజు, సీఈవో జాలాది నాగప్రసాదు,పలువురు రైతులు ఉన్నారు.

• స్నేహ పరిమళం



కుక్కపై విహరిస్తున్న వానరాలు

ప్రకృతి మన వేళ్లమధ్య సందులు ఎందుకు వదిలిందని అడిగిన శిష్యుడికి మరొకరితో 'స్నేహం' చేయదానికి, వారి చేతి వేళ్లు వాటి మధ్యన పొదుగుకోవడానికి అని గురువు సమాధానమిచ్చాడట.. జీవితాల్లో ఒంటరి - ఒటమితనం ఎదురైతే వారివెంట వచ్చేవాడు స్నేహితుడే. స్నేహం అనేది శ్వాసించే రోజా వంటిది. అందులోని ప్రతీభాగము మకరందంతో నిండి ఉంటుంది. నువ్వు ఉన్నంత వరకు 'నేను' / 'నేను' ఉన్నంత వరకూ 'నువ్వు' / మనం ఉన్నంత వరకు 'మన స్నేహం' కొనసాగాలనే అందరూ భావన చేస్తారు. అందుకే అమ్మా-నాన్నల తరువాత నమ్మదగిన బంధం ఏదైనా ఉందీ అంటే అది ఒక్క స్నేహబంధం మాత్రమే. అంతెందుకు, వేలాది మిత్రులను కలిగి ఉండటం అద్భుతం కాదు. వేల సమస్యను తీర్చగల ఒక చక్కని సన్మిత్రుడిని కలిగి ఉండటమే అత్యద్భుతమని చెబుతారు. అలాంటి స్నేహమే రెండు విభిన్న జంతు జాతుల మధ్య తారసపడింది. వినుకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటరులో ఒక కుక్కతో రెండు కోతి పిల్లలు స్నేహాన్ని పెంచుకున్నాయి. దానితోనే ఎక్కువ సేపు కాలక్షేపం చేస్తున్నాయి. ఆ వానరాల తల్లి ఎటువెళ్లిందో తెలియదు కాని సదరు కుక్క వీపు ఎక్కి పడుకుని.. అల్లరి చేస్తూ అటుగా వెళ్లే వారి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. జాతివైరం మరచి ఈ రెండు భిన్నజాతులు అందరి మధ్యన స్నేహంగా కలసి సంచరిస్తుండటంపై అందరిలోనూ ఆసక్తి కలిగిస్తోంది. తమ స్నేహాన్ని చూసి మీరెంతో నేర్చుకోవాల్సిన ఉందని అవి స్పష్టం చేస్తున్నాయి.

- వినుకొండ

పట్టుదలతో విద్యనభ్యసించాలి

- డాక్టర్ ఆర్. వినోద్‌కుమార్
- ఈశ్వర్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే



డాక్టర్ వినోద్‌కుమార్‌ను సత్కరిస్తున్న యాజమాన్యం

నరసరావుపేట రూరల్: క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించాలని పట్టణ ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఆర్. వినోద్‌కుమార్ తెలిపారు. ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. వేడుకలకు డాక్టర్ వినోద్‌కుమార్, ఎంఈవో యస్.నాగేశ్వరరావు, వెబ్ డెవలపర్ జి.భవాని శంకర్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్‌కుమార్ మాటాడుతూ గొప్ప వ్యక్తులు ఎక్కడి నుంచో తయారుకారని కళాశాలలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మిమ్మల్ని మీరే గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎంఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో గొప్పదని, బాగా కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. సాధారణ విద్యార్థినే అని అవకాశాలు కోసం ఎదురుచూడకుండా మనమే అవకాశాలు సృష్టించే దిశగా ఎదగాలని తెలిపారు. వేడుకలను పురస్కరించుకొని వారం రోజుల పాటు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, చెస్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు వేడుకలలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కార్యదర్శి షేక్ కరీంమొహిద్దీన్, ఎండీ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ షేక్ నజీమా, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వర రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు హెచ్ గంగాధరర రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టెయిల్‌పాండ్‌ను సందర్శించిన జేఎన్టీయూఎన్ విద్యార్థులు



టెయిల్ పాండ్ వద్ద జేఎన్టీయూ ఎన్ విద్యార్థులు

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం విద్యార్థులు శనివారం సత్రశాలలోని టెయిల్ పాండ్ ను సందర్శించారు. అకడెమిక్ క్యాలెండరులో భాగంగా 'పవర్ ప్లాంట్ ఇంజినీరింగ్' సబ్జెక్టుకు సంబంధించి ప్రాక్టికల్ అవగాహన కోసం రెంటచింతల మండలంలోని సత్రశాలలోని ఏపీ జెన్కో నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ డ్యామ్‌ను సందర్శించారు. మెకానికల్ బ్రాంచ్‌కి చెందిన 55 మంది విద్యార్థులు ఈ సందర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలోచనతో పాటు పారిశ్రామిక స్థాయిలో అనుభవం పొందే అవకాశం కలగడం ఎంతో ఉపయోగకరమని చెప్పారు. హైడ్రాలిక్ పవర్ జనరేషన్‌లో వినియోగించే ఆధునిక టెక్నాలజీని ప్రత్యక్షంగా చూడటం వల్ల విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కలుగుతుందని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. వై.ఎస్. కిషోర్ బాబు, మెకానికల్ విభాగాధిపతి డా. ఐ.ఎస్. ఫణి సుష్మ, అధ్యాపకులు డా. జి. సులోచన, యం. బాలాజీ నాయక్ లు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

సత్తెనపల్లి: యువకుడు కనిపించడం లేదని సత్తెనపల్లి రూరల్ పీఎస్‌లో కేసు నమోదైంది. మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన 29 ఏళ్ల యువకుడు షేక్ ఆసిఫ్ ఈ నెల 16వ తేదీ రాత్రి సత్తెనపల్లి మండలం కంటెపూడి గ్రామానికి వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం పలుచోట్ల వెదికినా సమాచారం లభించలేదు. అతని తండ్రి షేక్ హుసన్ సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఆసిఫ్ ఆచూకి తెలిసిన వారు సత్తెనపల్లి రూరల్ సీఐ 94407 96231 తెలపాలని పోలీసులు పేర్కొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక విద్యార్థుల అవస్థలు

చిలకలూరిపేట: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయలేదన్న కారణంతో పలు విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని కన్జ్యూమర్ రైట్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో విద్యాసంస్థలు ఆడుకోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. పీజీ పూర్తి చేసిన వారి ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్లతో సహా విద్యాసంస్థలు తమ వద్దే ఉంచుకొని వారిని మానసిక ఆవేదనకు గురిచేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే విద్యార్థులు ఏం చేయగలరని ప్రశ్నించారు. ఈ విషయమై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.